# పగటి వేషాలు

'శేషయ్యా?'

'ప్రభూ!'

'మనం ఈ ప్రచ్ఛన్న వేషాలతో తిరగడం ప్రారంభించి ఈ వేళటికి సరిగ్గా వారం అవుతుంది గదూ?'

'అవునండి—సరిగ్గా వారం!'

'ఇంతవరకూ మనం ఏం చేసినట్టు?'

'చిత్తం! ప్రభువువారికి తెలియని దేముందండీ?'

'ఎక్కడా మాత్రం మనల్నెవరూ పోల్చలేరు—'

'లేదండి—మన వేషాలు చక్కగా కుదిరాయి—'

'నేను సరిగ్గా వెర్రి గొల్లవాడికి మల్లే వున్నాను కదూ?'

'వేషంలో మటుకేనండి!'

'వేషంలో నే! కాకపోతే నిజంగా అనుకున్నావా?'

'నిజంగా అని ఎందుకనుకుంటానండీ-వొళ్లు చీరెయ్యరూ?'

'శేషయ్యా?'

'దేవా!'

'నీ వేషంకూడా బాగా కుదిరింది సుమీ! అచ్చం! వెర్రికోమటిలా వున్నావు.'

'ప్రభువుల కటాక్షం!'

'మనం ఇద్దరం రాజూ, మంత్రి అని ప్రజలు వూహించుకుందుకు ఎక్కడా అవకాశం లేదు—కదూ?'

'అవునండి!'

'అయితే, శేషయ్యా!'

'అయ్యా!'

'మనం-ఇప్పటికి మన సంస్థానంలోని అన్ని ముఖ్య ప్రదేశాలూ చూసి నట్టే గదూ ?'

'చిత్తం అంతేనండి !'

'మన ప్రజల కష్ట సుఖాలన్నీ మనకు పూర్తిగా తెలిసినట్టే కదూ?'

'ఇంకా సందేహమాండీ ?'

'అయితే చూడు శేషయ్యా ?'

'చూస్తున్నా ప్రభూ !'

'మా నాయనగారుకూడా తమ హయాంలో ఇలా అనేకసార్లు ప్రచ్ఛన్న వేషంలో రాజ్యమంతా తిరిగినట్టే కదూ ?'

'చిత్తం అంతేనండి !'

'అయితే వారు కొన్నాళ్ళపాటు ఇలా సంచారంచేసి ఇంటికి వెళ్ళి పోయేవారు కదూ ?'

'అవునండి ! ఇంటికిగాక ఇంకెక్కడికి వెడతారండీ?'

'అప్పుడంతా వారినిచూసి మెచ్చుకొనేవారా ?'

'గొప్పగా మెచ్చుకొనేవారండి !'

'అయితే మనం ఇంటికి వెళ్ళగానే మనల్నికూడా అంతా మెచ్చుకుంటారు కదూ ?'

'తప్పకుండానండి ! అయితే...?'

'ఏమిటి నగుసుతున్నావు ?'

'అబ్బె, ఏం లేదండి- మనం ఇలా ప్రచ్ఛన్నంగా తిరుగుతూండే సందర్భంలో ఎవరిచేతనో ఒకరిచేత, ఏదో ఒక సత్కార్యం చేస్తూన్న సందర్భంలో గుర్తింపబడాలండి-'

'అంటే ?'

'ఈ వేషంలోనే తమరు ఏదో గొప్ప పనిని చేస్తూండగా తెలిసినవారెవరో చూడాలండి-చూసి ఇతరులకు చెబితే ఆనోటా ఆనోటా అది ప్రఖ్యాతిగా మారి తమ కీర్తిని అధికం చేస్తుంది-'

'కొంచం అర్థమవుతూంది-అయితే ఈ విషయంలో మా నాయనగారి అనుభవాలు కొన్ని చెప్పగలవా ?'

'మహాప్రసాదం! వినండి చెబ్తా-'

'వింటున్నా!'

'ఒకప్పుడు తమ నాయనగారిలానే ప్రచ్ఛన్నంగా తిరుగుతూ ఒక బీద గొల్లవాడికో మొహిరీ ఇచ్చారు-'

'ఊఁ! అప్పుడు?'

'వాడా మొహిరీ పట్టుకుని వూళ్ళోకెడితే రాజభటులు వాడిని పట్టుకుని దొంగగా భావించి దండించారు-'

'పాపం! ఎంత ప్రమాదం?'

'అప్పుడు నాయనగారికా సంగతి తెలిసి ఆ గొల్లవాడిమీద నేరాన్ని రద్దుచేయించి, వాడికి మరికొన్ని మొహిరీ లిప్పించి పంపించారు-'

'ఎంత మంచిపని చేశారు?'

'అప్పుడు ప్రజలంతా దానిలోని అంతరార్థాన్ని గ్రహించి మొట్ట మొదట వాడికా మొహిరీని ఇచ్చిందికూడా నాయనగారేనని తెలుసుకుని వారి చర్యను ఎంతో ప్రశంసించారు-నాయనగారు ఇలాంటి పను లెన్నో చేసి పేరుపడ్డారు-'

'అయితే శేషయ్యా, మనంకూడా కొన్ని మొహిరీలు-ఎవరి కిద్దాం?'

'మొహిరీలంటే మొహిరీలే కాదండి-ఉదాహరణకు చెప్పానంతే-- మనం ఇంకా గొప్ప గొప్ప పనులను చెయ్యవొచ్చు-'

'ఎలాంటివి?'

'నేనప్పుడే సిద్ధపరచే వుంచానండి ఒక బ్రాహ్మడ్ని-'

'బ్రాహ్మడ్నా-ఎందుకూ?'

'చిత్తం! దానికంతా వుందండి-'

'ఏమిటది? ఏముందోయి శేషయ్యా-త్వరగా చెప్పు!'

'ఆ బ్రాహ్మడ్ని పులి తరుముతూండగా-'

'ఎప్పుడూ? ఎక్కడా?'

'వినండి! తొందరపడబోకండి-ఆ బ్రాహ్మడ్ని పులి తరుముతూండగా తమరు ఆ పులిని సంహరించినట్టు-'

'నేనా! శేషయ్యా, నేను పులిని చంపానా?'

'చంపారండి!-కనీసం, ఈపాటప్పుడే ఆ బ్రాహ్మడు మన వూరం తెలియబరచి వుంటాడు-'

'శేషయ్యా-ఇది అబద్ధం కాదుటోయి?'

'ప్రభువు వారు ఇలాటి భయాలు పెట్టుకోకూడదు - వూరును స పిస్తున్నాం-'

'శేషయ్యా?'

'ప్రభూ! నిశ్చింతగా వుండండి-ఈ నెత్తురుపూసిన కత్తిని ధైర్యం పట్టుకుని వూళ్లో అడుగు పెట్టండి-'

'నేనే చంపానని చెప్పమంటావా పులిని?'

'మీరేం చెప్పొద్దు-అంతా ఆ బ్రాహ్మడే చెప్పివుంటాడు - ప్రజ శ్లాఘిస్తాంటే మీరు చేయవలసిన పని గమ్మని వూరుకోవడమే! వూళ్లో వచ్చాం-ధైర్యం వహించండి-పులిని చంపినట్టుగా చూడండి!'

'ప్రయత్నిస్తాను! కాని, శేషయ్యా, అయితే ఆ పులి ఎన్ని అడుగు పొడవుందని ఎవరైనా అడిగితే ఏం చెప్పమన్నావు?'

'ఎవరూ అడగరండి-అడిగితే అటువంటివారిని దండిద్దాం!'

'శేషయ్యా ఏమిటోయి ఆ సమూహం?'

'చిత్తం! మన ప్రజలేనండి-తమర్ని సన్మానించడానికి వస్తున్నారు- ఠీవిగా నడవండి-'

'వారికి ముందుగావున్న బ్రాహ్మడేనా నువ్వు చెప్పిన...'

'చిత్తం, చిత్తం! అతడేనండి!'

'అతడు నన్ను బాగా ఎరుగునోయి-కుక్కను చూస్తేకూడా నాకు భయమన్న సంగతి అతడెరుగును-'

'అయితే ఏమండీ-అనుకున్న డబ్బంతా అతడికి మనం ఇచ్చేస్తే నోరు మెదపడు-'

'ఎంతకి బేరమాడేవు ఈ కీర్తిని?'

'ఆ వివరాలన్నీ నేను చూసుకుంటా లెండి!-మీ నడకలో మరి కొంచం పులిని చంపిన స్వభావం కనుపించాలి - వారంతా దగ్గర కొస్తున్నారు!'